

కారెంపూడి చేరుకున్న యాత్ర

కారెంపూడి: లఢక్‌ నుంచి అండమాన్‌ నికోబార్‌ దీవుల వరకు ఆర్మీ చేపట్టిన సైకిల్‌ యాత్ర ఆదివారం కారెంపూడి చేరుకుంది. జెడ్పీ హైస్కూల్‌ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.



ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లి రూరల్‌: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళి ఆలయానికి చిలువూరుకు చెందిన బొడ్డపాటి శంకర్‌, అరుణ దంపతులు రూ.1,00,116 అందజేశారు.



బాడీ బిల్డింగ్‌ పోటీలు

గుంటూరు వెస్ట్‌ (క్రీడలు): వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జోనల్‌ లెవెల్‌ బాడీ బిల్డింగ్‌, స్టేట్‌ లెవెల్‌ కెటిల్‌ బెల్‌ పోటీలు ఆదివారం జిల్లా బాడీ బిల్డర్స్‌ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి.

న్యూస్‌రీల్‌

తాడేపల్లిలో 37.6 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా తాడేపల్లి మండలంలో 37.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పొన్నూరు మండలంలో 5.6 మి.మీ. పడింది. జిల్లా సగటు 14 మి.మీ.గా నమోదైంది. మండలాలవారీగా చూస్తే... కొల్లిపర 37.4, తెనాలి 27.2, దుగ్గిరాల 18.8, తాడికొండ 17.4, వట్టిచెరుకూరు 11.8, పెదకాకాని 11.6, మంగళగిరి 10.6, తుళ్ళూరు 10.4, కాకుమాను 10.2, ప్రత్తిపాడు 9.2, పెదనందిపాడు 8.4, ఫిరంగిపురం 8.2, చేబ్రోలు 7.8, గుంటూరు తూర్పు 6.8, గుంటూరు పశ్చిమ 6.6, మేడికొండూరు మండలంలో 6.4 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

గుంటూరు వెస్ట్‌: ప్రతి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్‌ శంకరన్‌ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను భారీ వర్షాల కారణంగా తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజలు ఈ విషయం గమనించాలని అధికారులు కోరారు. స్థానికంగా ఉండే ఇబ్బందులను గ్రామ, వార్డు సచివాలయాల్లో తెలియజేయాలని సూచించారు. భారీ వర్షాలతో ఎదురైన సమస్యలపై కలెక్టరేట్‌లోని టోల్‌ ఫ్రీ నెంబర్‌ 0863–2234014తోపాటు మండల స్థాయిలో తహసీల్దార్‌ కార్యాలయాలను సంప్రదించాలని కోరారు.

'పోలీస్‌ స్పందన' కూడా...

నగరంపాలెం: ఈ నెల 9వ తేదీన గుంటూరు జిల్లా పోలీస్‌ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పోలీస్‌ స్పందన'ను బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తాత్కాలికంగా రద్దు చేశారు. ఈ మేరకు డీపీఓ అధికార వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదిదారులు ఈ విషయం గమనించాలని కోరాయి.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



తెనాలి రూరల్‌: వినాయక నిమజ్జనం కోసం చేసిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ జి.సతీష్‌కుమార్‌ ఆదివారం పరిశీలించారు. తెనాలి మండలం సంగం జాగర్లమూడి వద్ద కొమ్మమూరు కాల్వలో ఏటా నిమజ్జనం చేస్తుంటారు. ప్రస్తుతం కాల్వలో నిండుగా నీరు ప్రవహిస్తుండటంతో ఎస్పీ పరిశీలించారు. అక్కడ నిమజ్జనం కోసం చేసిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని చెప్పారు. తెనాలి రూరల్‌ సీఐ బెల్లం శ్రీనివాసరావు, చేబ్రోలు పోలీసులు ఆయన వెంట ఉన్నారు.

కొనసాగిన కాంట్రాక్ట్‌ స్టాఫ్‌ నర్సుల నిరసన



గుంటూరు మెడికల్‌: కాంట్రాక్ట్‌ స్టాఫ్‌ నర్సులను రెగ్యులర్‌ చేయాలని, ప్రభుత్వం ఈ నెల 4న విడుదల చేసిన జీఓ నెంబర్‌ 115ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ ఆదివారం కూడా నిరసన కార్యక్రమం కొనసాగింది. గుంటూరు జీజీహెచ్‌లో కాంట్రాక్ట్‌ స్టాఫ్‌ నర్సులు చేపట్టిన ఈ కార్యక్రమం మూడో రోజుకు చేరుకుంది. నర్సింగ్‌ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. సూపరింటెండెంట్‌ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ బైటాయించారు. శనివారం వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుడికి పూజలు చేశాక తమ సమస్యలపై వినతి పత్రం అందించి, వినూత్నంగా నిరసన తెలిపారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునే వరకు వెనక్కి తగ్గబోమని ఆంధ్రప్రదేశ్‌ నర్సుల పోరాట కమిటీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నేతలు స్వచ్ఛంద ప్రసాద్‌, పి.మనీష, బి.శివమ్మ, వి.విజయ్‌ కుమార్‌, హైమావతి, కుసుమ కుమారి, కరుణ తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు మల్లారెడ్డి నగర్‌ పరిధి ఓ అపార్టుమెంట్‌లో గణపతి పూజలో మహిళలు



గుంటూరు శ్రీనగర్‌లో రథంపై గణనాథుడు



నిడుబ్రోలు రైలుపేటలో మంచుకొండల్లో గణపతి ధ్యాన ప్రతిమ



రెడ్డి హాస్టల్‌లో పూజలు చేస్తున్న విద్యార్థులు

మహా గణాధిపతయే నమః

వినాయక చవితి వేడుకలను జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. బొజ్జ గణపయ్యను కొలువుదీర్చి భక్తులు ఘనంగా పూజలు చేశారు. వేడుకలకు మండపాలను ముస్తాబు చేసి యువకులు, పెద్దలు, కాలనీసంఘాలే కాకుండా చిన్నారులు కూడా ఉత్సాహంగా ఉత్సవాలు నిర్వహించారు. శనివారం పెద్ద విగ్రహాలను, వైవిధ్య ప్రతిమలను పలుచోట్ల కొలువుదీర్చారు. మట్టి ప్రతిమలను కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపారు. పలు చోట్ల ఆదివారం మేళతాళాల నడుమ నిమజ్జనం సందడిగా నిర్వహించారు. లంబోదరుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. - సాక్షి ఫొటోగ్రాఫర్‌, గుంటూరు



గుంటూరు ఏలూరు బజారులో...

మళ్లీ వరద ముప్పు

- ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- సోమవారం ఉదయానికి ప్రవాహం పెరిగే అవకాశం
- మరోసారి లంక గ్రామాల ప్రజల్లో ఆందోళన
- తాడికొండ పరిధిలో పంటలను వీడని ముంపు
- నీరు బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని రైతుల వినతి
- అత్యధికంగా తాడేపల్లిలో 37.6 మి.మీ. వర్షపాతం

ప్రకాశం బ్యారేజ్‌ వద్ద పెరిగిన నీటి విడుదల

జిల్లాను ఇంకా వానలు వీడటం లేదు. మరోవైపు కృష్ణా వరదకు ఇప్పటికే పలు చోట్ల భారీగా నష్టం వాటిల్లగా... మరోమారు నదిలో ప్రవాహం పెరుగుతోందనే హెచ్చరికలతో తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు గజగజలాడుతున్నారు. ముఖ్యంగా ఇప్పటికే అపార పంట నష్టంతో కుదేలైన రైతులు మరింత ఆవేదన చెందుతున్నారు. ఇక లంక గ్రామాల వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈసారి వరద వస్తే నిలువ నీడ కూడా ఉండదేమోనని భయపడుతున్నారు.

తాడేపల్లి రూరల్‌: కృష్ణా నది ప్రకాశం బ్యారేజ్‌ వద్ద ఆదివారం సాయంత్రానికి వరద ఉధృతి పెరగడంతో ఇరిగేషన్‌ శాఖ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్‌ శాఖ జేఈ దినేష్‌ మాట్లాడుతూ.. ప్రకాశం బ్యారేజ్‌ వద్దకు ఎగువన ఉన్న పులిచింతల, కీసర, మున్నేరు, వెలగలేరు తదితర వాగుల నుంచి 4,56,400 క్యూసెక్కుల వరద నీరు వస్తోందని తెలిపారు. మొత్తం 72 గేట్లను పూర్తిగా ఎత్తి అంతే మొత్తం నీటిని కిందికి వదులుతున్నట్లు వివరించారు. తూర్పు, పశ్చిమ డెల్టాకు 202 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజ్‌ వద్ద నీటి మట్టం 13.1 అడుగుల మేర ఉందని తెలిపారు. సోమవారం ఉదయానికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. దిగువ ప్రాంతాలలో ఉన్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

లంక గ్రామాలకు మళ్లీ టెన్షన్‌

కొల్లిపర: మండలంలో ఇటీవల వరదల కారణంగా లంక గ్రామాలైన పాత బొమ్మువానిపాలెం, అన్నవరపు లంక, కొత్తూరు లంకతోపాటు వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, అన్నవరంలలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంటతోపాటు ఆస్తి నష్టం కూడా ఎక్కువగానే జరిగింది. 5వ తేదీ తరువాత కొంత మేరకు వరద లేకపోవటంతో పంట పొలాలలో ఉన్న నీరు తగ్గింది. దీంతో కొన్ని పంటలైనా ఎంతో కొంత చేతికి వస్తాయని కొంత మంది రైతులు భావిస్తున్న తరుణంలో కృష్ణా నదికి ఆదివారం ప్రవాహం పెరిగింది. దీంతో రైతులు, లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రెండో సారి కూడా వరద పెరిగితే తీవ్ర నష్టం ఉంటుందని వాపోతున్నారు. ఇప్పటి వరకు పంటలు, పశువులకు మాత్రమే నష్టం జరిగిందని.. ఈసారి వరద వస్తే గృహాలు కూడా పూర్తిగా దెబ్బతినే దుస్థితి తలెత్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి నిలువ నీడ కూడా లేకుండా కట్టుబట్టలతో రోడ్డుపైకి వచ్చే దుస్థితి తప్పదని ఆందోళన చెందుతున్నారు.



పుష్కర ఘాట్ల వద్ద పెరిగిన వరద నీటి ఉధృతి

వందల ఎకరాల్లో ఇప్పటికే పంట నష్టం

కొల్లిపర మండలంలో 1,400 ఎకరాలలో రైతులు వరి సాగు చేస్తున్నారు. వర్షాలు, వరదల కారణంగా అత్తలూరిపాలెం, వల్లభాపురం, దంతలూరు, అత్తోట, శిరిపురం, చివలూరు తదితర గ్రామాలలో పొలాలు పల్లపు ప్రాంతాలలో ఉండటంతో 260 ఎకరాలలో వరి పంట, 20 ఎకరాలలో మినుము పూర్తిగా మునిగి నష్టం జరిగింది. కృష్ణా నది వరదల కారణంగా కొల్లిపర మండలంలోని 8 గ్రామాలలోని పసుపు, అరటి, కూరగాయల సాగుకు నష్టం వాటిల్లింది. కొల్లిపర మండలంలో కరకట్ట దిగువన 1,869 మంది రైతులు 1,424 ఎకరాలలో వివిధ వాణిజ్య పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 678 ఎకరాల్లో అరటి సాగు చేస్తున్న 860 మంది రైతులకు నష్టం జరిగింది. కూరగాయలు 194 ఎకరాల్లో సాగు చేస్తున్న 252 మంది అన్నదాతలు కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారు. పసుపు 548 ఎకరాల్లో వేసిన 752 మంది రైతులకు కష్టాలు తప్పలేదు. 4 ఎకరాలలో నిమ్మ సాగు చేసిన ఐదుగురు రైతులకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు.



వరద ఉధృతి మళ్లీ పెరుగుతుందనే హెచ్చరికతో కొల్లిపరలో కృష్ణా నది వద్దకు వచ్చి చూస్తున్న స్థానికులు

వరద పోయేలా చర్యలు తీసుకోవాలి

తాడికొండ: వదలకుండా కురుస్తున్న భారీ వర్షాలతో శివారు కాలనీలు జలమయం అయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొండవీటి వాగుకు గత 20 సంవత్సరాల్లో లేనంతగా వరద చేరడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి అన్నదాతలకు తీరని నష్టాన్ని మిగిల్చింది. తాడికొండ మండలంలో ఖరీఫ్‌లో అపరాల రైతులకు 40 శాతం మందికి మాత్రమే పంట ఇంటికి వచ్చింది. మిగిలిన వారికి గింజ చేతికి వచ్చే పరిస్థితి లేదు. దాదాపు ఎనిమిది రోజులుగా నీటిలోనే పంట కుళ్లి తీరని నష్టం మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి కూడా నానుతుండటంతో నీటిని బయటకు పంపాలని కోరుతున్నారు. ఇప్పటికే 50 శాతం పత్తి పంట దెబ్బతింది. వెంటనే నీటిని బయటకు పంపించి తగిన చర్యలు చేపట్టకపోతే అది కూడా చేతికందకుండా పోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు కోరుతున్నారు. సంబంధిత వ్యవసాయ, ఇరిగేషన్‌, రెవెన్యూ తదితర శాఖల అధికారులు స్పందించాలని వారు వేడుకుంటున్నారు. వెంటనే కొండవీటి వాగు ముంపు నీటిని బయటకు పంపించి, గండ్లు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా తాడేపల్లి మండలంలో 37.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



తాడికొండ మండలంలో నీట మునిగిన పంట



వరద తగ్గడంతో కొల్లిపరలో పసుపు పంట దుస్థితి



ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు

జల దిగ్బంధంలో అయ్యప్పపురం

తెనాలి రూరల్‌: కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెనాలి మండలం కఠెవరం గ్రామ శివారులోని అయ్యప్పపురం నీటిలో మునిగింది. సుమారు 10 రోజులుగా కాలనీ వాసులు నీళ్లలోనే నడుచుకుంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. పట్టణ బాలాజీరావుపేటను ఆనుకుని ఉండే ఈ కాలనీ తెనాలి మీదుగా ప్రవహించే పడమర కాల్వ వెంబడి ఉంది. ప్రస్తుతం కాల్వలు పూర్తి సామర్థ్యంతో నీటితో నిండి ప్రవహిస్తున్న నేపథ్యంలో అయ్యప్పపురంలోని వర్షపు నీళ్లు కాల్వలోకి వెళ్లే పరిస్థితి లేదు. 10 రోజులుగా ఇబ్బందులు పడుతున్నా తమను పట్టించుకున్న నాథుడే లేడని కాలనీ వాసులు వాపోతున్నారు. నీరు బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మళ్లీ వరదొస్తే పూర్తిగా దెబ్బతింటాం



కృష్ణా నది కరకట్ట దిగువన 2 ఎకరాల పొలం ఉంది. ఎకరంలో పసుపు, మరో ఎకరంలో అరటి సాగు చేస్తున్నా. వరదల కారణంగా ఇప్పటికే పసుపు పూర్తిగా చేతికి రాకుండా మట్టి పాలైంది. అరటి కొంత మేరకు దెబ్బతిన్నా ఏదో ఒక రకంగా మందులు వాడి సాగు చేద్దామని భావించా. రెండు రోజులుగా వరద తగ్గిందని అనుకునేలోపే మళ్లీ కృష్ణా నదికి ప్రవాహం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సారి వరద వస్తే మొత్తం పంట కూడా పోతుంది. ఇప్పటికే రూ.మూడు లక్షల వరకు పెట్టుబడి ఖర్చు అయింది. వరదలు ఇలాగే ఉంటే కుటుంబం రోడ్డున పడాల్సిందే. ఈ సమయంలో ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– బొమ్ము సుబ్బారెడ్డి, పాత బొమ్మువానిపాలెం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల అరెస్టు

24 కిలోల వెండి, కారు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని నగల దుకాణంలో ఈ నెల 4వ తేదీన జరిగిన దొంగతనం కేసులో అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను పొన్నూరు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు 24 కిలోల వెండి వస్తువులు, 6 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. శనివారం పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు కేసు వివరాలను వెల్లడించారు. కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్‌ రాష్ట్రాలకు చెందిన ఏడుగురు ముఠాగా ఏర్పడ్డారని తెలిపారు. పక్కా వ్యూహంతో అర్ధరాత్రి పొన్నూరులోని నగల దుకాణంలో చోరీ చేశారని పేర్కొన్నారు. స్థానికులు వారిని పట్టుకునేందుకు వెంబడించగా నలుగురు కారులో పరారయ్యారని తెలిపారు. మిగిలిన సుమన్‌ కమతి, విక్రందాస్‌ చరణ్‌, ఉత్తమ్‌ సింగ్‌లు పొన్నూరులో పట్టుబడ్డారని చెప్పారు. కారులో పరారవుతున్న మిఠాలాల్‌ మాలి, పరసారామ్‌లను చిత్తూరు జిల్లాలోని టోల్‌ ప్లాజా వద్ద చంద్రగిరి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ఆషు సింగ్‌, అజు పరారీలో ఉన్నారని వెల్లడించారు. వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. నిందితుల నుంచి 24 కిలోల వెండి వస్తువులను, 6 సెల్‌ ఫోన్లను, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దుకాణ యజమాని అబ్దుల్‌ సలీం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన పట్టణ సీఐ రవి కిరణ్‌, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు

ఈ–క్రాప్‌ బుకింగ్‌లో జాప్యంపై ఆవేదన

- యంత్రాంగం నిర్లక్ష్యాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన కౌలు రైతులు
- వారంలోగా ప్రక్రియ పూర్తి కావాలని అధికారులకు పెమ్మసాని ఆదేశాలు

పెదకాకాని: ఈ–క్రాప్‌ బుకింగ్‌లో అధికార యంత్రాంగం ప్రదర్శించిన అలసత్వంపై కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో వానలు, వరదలతో జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ఆదివారం వచ్చిన కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్‌ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కష్టాలు వివరించారు. దీంతో ఈ– క్రాప్‌ బుకింగ్‌ ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు. పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో వెంకట కృష్ణాపురం, హాఫ్‌పేట, అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, శేకూరు, వీరనాయకునిపాలెం, సుందరయ్య కాలనీ, ముట్లూరు, పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, అనుమర్లపూడి ప్రాంతాలలో వానలు, వరద వల్ల జరిగిన నష్టాన్ని మంత్రి పరిశీలించారు. పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్య కాలనీ నీట మునగడంతో ఇండస్‌ టవర్స్‌ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సుమారు 330 మందికి దుస్తుల కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను ఐదు రోజులుగా పర్యటిస్తున్నానని చెప్పారు. సీఎం చంద్రబాబు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని గుర్తుచేశారు. పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని తెలిపారు. బాధిత రైతులకు, కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ–క్రాప్‌ బుకింగ్‌ పనులు ఇప్పటికీ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. వారం రోజుల్లోగా ఈ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. దుస్తుల పంపిణీ కార్యక్రమానికి మండల సీపీఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్‌ నాగలక్ష్మి, ఇండస్‌ టవర్స్‌ లిమిటెడ్‌ సీఈవో గంటా దిలీప్‌ కుమార్‌, స్థానిక నాయకులు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నష్టం గురించి తెలుసుకుంటున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్



తాడికొండ: కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన చిలకా విజయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐసీసీ వర్గాలు తనకు సంబంధిత ఉత్తర్వులు అందజేసినట్లు చెప్పారు. వార్డు స్థాయి నుంచి పార్టీలో ఉన్న తాను పలు బాధ్యతలు నిర్వర్తించి నేడు ఈ స్థాయికి వచ్చినట్లు వివరించారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల తనకు ఈ బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

పాముకాటుతో ఏఎన్‌యూలో విద్యార్థి మృతి



పెదకాకాని: పాముకాటుతో బుద్ధిజం విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్ దేశానికి చెందిన కొండన్న పెదకాకాని మండలంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎంఏ బుద్ధిజం (మహాయాన బుద్ధి స్టడీస్ కోర్సు) చదువుకునేందుకు ఈ సంవత్సరం చేరాడు. సహచర విద్యార్థులతో అక్కడే వసతి గృహంలో ఉంటున్నాడు. పుట్ట గొడుగుల కోసం శనివారం రాత్రి సమయంలో క్యాంపస్ ఆవరణలోని పుట్టల వద్ద సహచర విద్యార్థులతో కలిసి వెతికాడు. అక్కడే ఉన్న రక్తపింజర పాము కొండన్నను కాటేసింది. సహచరులు ఆ పామును గుర్తించడం, చంపడంతో అక్కడే కొండన్నను వైద్యం నిమిత్తం తరలించడానికి ఆలస్యం అయింది. తర్వాత చినకాకాని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే కొండన్న మరణించినట్లు నిర్ధారించారు. వర్సిటీ అధికారుల దృష్టికి విద్యార్థులు ఈ విషయం తీసుకెళ్లడంతో వారు ఎన్ఆర్ఐ ఆసుపత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడారు. అనంతరం సమాచారాన్ని అతడి కుటుంబ సభ్యులకు తెలిపారు.

ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపిక

నరసరావుపేట రూరల్: కేరళలోని కలామావులో ఈనెల 10వ తేదీనుంచి జరగనున్న ఆల్ ఇండియా ట్రెక్కింగ్ క్యాంప్‌నకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ పి.నిఖిత, షేక్ అఫ్రీన్ నేహాలు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు అభినందించారు. శారీరక ధృడత్వం పెంపొందించుకోవడం, మానసిక ఒత్తిడిని అధిగమించడం, జాతీయ సమైక్యతపై శిక్షణనిస్తారని ఎన్‌సీసీ ఆఫీసర్ తెలిపారు.

గింజ ఆరేనా.. కష్టం తీరేనా!





గుంటూరు జిల్లా కొల్లిపర మండలం హనుమాన్‌పాలెం వద్ద వరద నీటికి తడిసిన మొక్కజొన్న గింజలను ఆరబెట్టిన రైతు. మళ్లీ వానలు, వరద ముప్పు పొంచి ఉందనే హెచ్చరికతో ఈ ప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌ను బలిగొన్న అతివేగం

- ముందు వెళ్తున్న ట్రాక్టర్, మరో వాహనాన్ని ఢీకొన్న లారీ
- ట్రాక్టర్ డ్రైవర్‌కు, మృతుడి కుమారుడికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన లారీ ముందు భాగం

ప్రత్తిపాడు: హైవేపై ఓ లారీ డ్రైవరు అతివేగంతో వెళ్లడంతో ప్రాణాలు కోల్పోయాడు. ముందు వెళుతున్న ట్రాక్టర్, మరో లారీని అతడు నడిపే వాహనం ఢీకొని నుజ్జు నుజ్జు అయింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు, ప్రమాదానికి కారణమైన లారీలో ఉన్న మృతుడి కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతురెడ్డి గ్రామానికి చెందిన మరమోసి బాబు (40), ఆయన కుమారుడు యశ్వంత్‌లు శుక్రవారం రాత్రి విజయవాడ నుంచి అనంతపురానికి సరుకుల లోడుతో లారీలో బయల్దేరారు. ఈ లారీ శనివారం తెల్లవారుజామున ప్రత్తిపాడు మండలం బోయపాలెం జాతీయ రహదారిపైకి వచ్చింది. అప్పుడే తాడేపల్లిగూడెం నుంచి చిలకలూరిపేటకు డెలివరీ ఇచ్చేందుకు తీసుకెళుతున్న కొత్త ట్రాక్టర్‌ను బలంగా ఢీకొంది. అధిక వేగం కారణంగా అదుపుకాక మరో లారీని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నడుపుతున్న యజమాని బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. క్యాబిన్‌లో కూర్చుని ఉన్న యశ్వంత్ తీవ్ర గాయాలపాలయ్యాడు. రెండు పల్టీలు కొట్టుకుంటూ ట్రాక్టర్ పక్కకు పడిపోవడంతో దాని డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతని వివరాలు తెలియాల్సి ఉంది. మరో లారీకి పెద్దగా నష్టం జరగకపోవడంతో అందులోని వారు వెళ్లిపోయారు. బాబు మృతదేహాన్ని బయటకు తీసేందుకు పోలీసులు క్రేన్‌ల సాయంతో దాదాపు గంటన్నరకుపైగా శ్రమించాల్సి వచ్చింది. యశ్వంత్, ట్రాక్టర్ డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాబు భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాబు మృతదేహం

టెన్నీకాయిట్ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక



ఎంపికైన జట్లతో జిల్లా సెక్రటరీలు, వ్యాయామ ఉపాధ్యాయులు

చెరుకుపల్లి: రాష్ట్ర టెన్నీకాయిట్ అసోసియేషన్ (సబ్ జూనియర్) టోర్నమెంటుకు జిల్లా బాలబాలికల జట్ల ఎంపికను ఆదివారం సెక్రెటరీ కాట్రగడ్డ అరవిందకుమార్ పర్యవేక్షణలో కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాను విడగొట్టిన నేపథ్యంలో బాపట్ల జిల్లాకు అలేఖ్య, పల్నాడు జిల్లాకు జి.ఝాన్సీ, గుంటూరు జిల్లాకు బి.రమేష్‌బాబును అసోసియేషన్ సెక్రటరీలుగా నియమించినట్లు తెలిపారు. సబ్ జూనియర్ బాలికలు విభాగంలో పిట్టు భాగ్యలక్ష్మి, చీరాల గాయత్రి (ప్రభుత్వ ఉన్నత పాఠశాల కావూరు), పోపూరి సాగరిక, తానిపర్తి నవ్య (కస్తూరిబా బాలికల విద్యాలయం) ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. బాలుర జట్టుకు కావూరి శివప్రసాద్, పిట్టు జగదీష్ రెడ్డి, అక్కల లోకేష్‌మారుతీ బ్రహ్మరెడ్డి, తమనం లితేష్ కుమార్ కావూరు ప్రభుత్వ పాఠశాల నుంచి ఎంపికైనట్లు వెల్లడించారు. వీరంతా త్వరలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని అరవింద్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వై. సాంబశివరావు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో అప్రమత్తత అవసరం

అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్



కర్లపాలెం: గణేష్ నిమజ్జనంలో అప్రమత్తత అవసరమని బాపట్ల అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. ఆయన ఆదివారం రూరల్ సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ రవీంద్రతో కలసి కర్లపాలెం, పేరలి గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో భక్తులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను సందర్శించారు. విగ్రహ కమిటీలకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం చేసే సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. చవితి వేడుకలు పూర్తయ్యేంత వరకు కమిటీ సభ్యులే రాత్రిపూట కాపలా ఉండాలని ఆదేశించారు. నిమజ్జన సమయంలో మద్యం తాగకూడదని సూచించారు. కర్లపాలెంలోని తుంగభద్ర కాలువకు వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున రాత్రి ఏడు గంటల్లోపు పోలీసుల సూచనల మేరకు నిమజ్జనాలు పూర్తి చేయాలని చెప్పారు.

చవితి వేడుకల్లో యువకుడు మృతి

శావల్యాపురం: వినాయకచవితి వేడుకల్లో విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని పోట్లూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు గ్రామంలో బీసీ కాలనీలో శ్రీనీలంపాటి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి వినాయక విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ఎస్సీ కాలనీకి చెందిన పోపూరి దేవసహాయం (20) విద్యుత్ దీపాలు అలంకరణ చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో 11 కేవీ విద్యుత్ సామర్థ్యం కలిగిన విద్యుత్ లైను ప్రమావశాత్తు తగలటంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోరీ కేసుల్లో ఐదుగురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై డేవిడ్ రాజు

మేడికొండూరు: జల్సాలకు అలవాటు పడి ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులను మేడికొండూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్సై డేవిడ్ రాజు కథనం మేరకు... తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గోగువారి గూడెంకి చెందిన నర్సింగ్ గంగాధర్, నర్సింగ్ మహేష్‌లు, పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన చింతా సాయికుమార్, బలుకూరి భీమలింగేశ్వరరావు, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాలూరు గ్రామానికి చెందిన జెట్టి కృష్ణ వేర్వేరు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వారిని మేడికొండూరు పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 17.8 గ్రాముల బంగారం, 674 గ్రాముల వెండి వస్తువులు, కారును స్వాధీనం చేసుకున్నారు. పేరేచర్ల డొంకలో సంజీవరావు హోటల్ వద్ద సంచరిస్తుండగా నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. మేడికొండూరు, పల్నాడు జిల్లా నకిరేకల్, సంతమాగులూరు పోలీస్ స్టేషన్లలో వీరిపై పలు దొంగతనాల ఇప్పటికే కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. మేడికొండూరు సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. పీసీలు జి. సిద్ధయ్య, కె.బాజీ సాహెబ్, కోటయ్య, శ్రీకాంత్, హోంగార్డులు ఎస్‌కే జానీ, వెంకటేశ్వర్లు ఈ కేసుల్లో ప్రతిభ చాటినందున ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అభినందించారని పేర్కొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన పవర్ లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి: ఈ నెల 14, 15వ తేదీలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరగబోయే పోటీలకు గుంటూరు పవర్ లిఫ్టింగ్ జట్లను ఎంపిక చేశారు. 11వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ విభాగాల్లో మెన్, ఉమెన్ జట్లు పాల్గొననున్నాయి. క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్ పోటీలలో ఈ జట్లు పాల్గొననున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. 30 మంది మహిళలు, 40 మంది పురుషులతో కూడిన ఈ జట్లు రాణించాలని ఆకాంక్షించారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ వివరాలను వెల్లడించారు. ఎంపికైన వారిని ప్రతినిధులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తదితరులు అభినందించారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్దేశకులు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక ప్రపంచంలో సమాజ గతిని మార్చగల ఏకైక శక్తి ఉపాధ్యాయులకే ఉందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిరోడ్డులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఆదివారం పాన్ ఇండియా ఐకానిక్ టీచర్స్ అవార్డ్స్–2024' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఒక పెన్ను, పుస్తకం, ఒక ఉపాధ్యాయుడికి ప్రపంచాన్ని మార్చగలిగే సత్తా ఉందని చెప్పిన ఆయన మలాలా యూసఫ్‌జాయ్ కలలను నిజం చేయాలని ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. అంకితభావంతో విద్యార్థులకు చదువుతోపాటు జీవిత గమనాన్ని నేర్పాలని సూచించారు. ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రామనాథం అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల క్రితం స్థాపించిన ఫెడరేషన్ ద్వారా కరోనా సమయంలో వందలాది మంది ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకులకు దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందించి వారిలో ధైర్యాన్ని నింపామన్నారు. ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులను, అధ్యాపకులను గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు వివరించారు. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, అధ్యాపకులను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ కన్నా మాస్టారు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ఇండో అమెరికన్ డాక్టర్ చాగంటి సుబ్బారావు, శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ఆల్‌ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్రకార్యదర్శి వై.మర్రెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు

నరసరావుపేట రూరల్: కమలేష్ చంద్ర పే కమిటి సిఫార్సులను అమలు చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై.మర్రెడ్డి తెలిపారు. మండలంలోని ఇస్సప్పాలెం ఆర్యవైశ్య వృద్ధాశ్రమంలో ఆదివారం నరసరావుపేట డివిజన్ గ్రామీణ సేవక్స్ యూనియన్ 12వ ద్వైవార్షిక మహాసభ నిర్వహించారు. సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మర్రెడ్డి మాట్లాడుతూ ఎక్కువ ఆదాయాన్ని తీసుకువచ్చే గ్రామీణ డాక్ సేవక్స్(జీడీఎస్) వల్లే పోస్టల్ శాఖ నడుస్తుందని తెలిపారు. పోస్టల్ శాఖకు ప్రోత్సాహన్ని ఇస్తున్న జీడీఎస్‌పై పోస్టల్ శాఖ నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందన్నారు. డాక్ సేవక్స్‌ను తక్కువ జీతాలతో పనిచేయిస్తుండంతో పాటు వారికి అందాల్సిన బెనిఫిట్స్ రాకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. దీంతో పాటు ఈ మధ్యకాలంలో గ్రామీణ డాక్ సేవక్స్‌కు లక్ష్యాలు విధించి ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. జీడీఎస్‌ల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు ఇప్పటివరకు అమలు చేయలేదని తెలిపారు. పెన్షన్ విధానం, ఎనిమిది గంటల పని విధానం, మెడికల్ వసతులతో పాటు కమిటీ చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జి.రామచంద్రయ్య, కార్యదర్శిగా పీవీ నారాయణ, కోశాధికారిగా సీహెచ్ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కాలువలో పడి లస్కర్ మృతి



కాలువ నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం



లక్ష్మయ్య (ఫైల్)

నరసరావుపేట రూరల్: ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఎన్ఎస్‌పీ కాలువ లస్కర్ మృతిచెందిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. లింగంగుంట్ల ఎన్ఎస్‌పీ కాలనీలో నివాసముంటున్న మల్లా లక్ష్మయ్య(50) చిలకలూరిపేట మేజర్ కాలువపై శాంతినగర్ వద్ద నుంచి గోవిందపురం మేజర్ వరకు లస్కర్‌గా పని చేస్తున్నాడు. ప్రస్తుతం నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదల ఉండటంతో శుక్రవారం డ్యూటీకి వెళ్లాడు. ఆ రోజు రాత్రి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అధికారులకు సమాచారం అందించారు. శనివారం ఉదయం లక్ష్మయ్య పనిచేసే ప్రాంతానికి వెళ్లి సిబ్బంది పరిశీలించారు. శాంతినగర్ సమీపంలోని డ్రాప్ వద్ద లక్ష్మయ్య ఉపయోగించే హ్యాండిల్, చెప్పులు కనిపించాయి. దీంతో కెనాల్‌లో సాయంత్రం వరకు గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం శాంతినగర్‌కు కిలోమీటర్ దూరంలో మృతదేహాన్ని రైతులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎన్ఎస్‌పీ సిబ్బంది అక్కడకు చేరుకొని లక్ష్మయ్యగా గుర్తించారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. నకరికల్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

కలువ పూల కోసం కాల్వలోకి దిగి వ్యక్తి మృతి

స్థానికుల సాయంతో మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు



సుబ్బారావు మృతదేహం

నగరం: కలువ పూలు కోసం కాల్వలో దిగిన వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆదివారం మండలంలోని చిరకాలవారిపాలెం మురుగు కాల్వలో(ఉప్పు కాల్వ) జరిగింది. ఎస్ఐ భార్గవ్ సమాచారం మేరకు.. రేపల్లె పట్టణం 27వ వార్డుకు చెందిన కొలుసు సుబ్బారావు (48) పూల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వినాయక చవితి సందర్భంగా మూడు రోజుల నుంచి ఉప్పు కాల్వలో పూలు కోసుకుని వెళ్లి అమ్ముకుంటున్నాడు. ఆదివారం ఉదయం ఉప్పు కాల్వలో దిగాడు. పూల కోసం మరింత లోతుకు వెళ్లి మునిగి పోవడంతో మృతి చెందాడు. కాల్వ బాగా లోతుగా ఉందని చెప్పినా సుబ్బారావు వినకుండా కలువ పూలకోసం కాల్వలో దిగి ప్రాణాలు కోల్పోయాడని పలువురు పేర్కొంటున్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఉప్పు కాల్వలో గాలించి సుబ్బారావు మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.సుబ్బారావు మరణవార్తతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుమారులు ఇద్దరికీ వివాహాలయ్యాయి. మృతుడి పెద్ద కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): భర్త కుటుంబాన్ని పట్టించుకోవటం లేదని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన మేడా తిరుపతమ్మ(25)కు సుమారు ఏడు సంవత్సరాల క్రితం మేడా సుధాకర్‌తో వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబాన్ని పట్టించుకోకుండా భర్త చెడు వ్యసనాలకు బానిసై ఇబ్బందులకు గురి చేస్తుండటాన్ని తిరుపతమ్మ తట్టుకోలేక పోయింది. ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

డ్వాక్రా రుణాలను రీషెడ్యూల్ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి



భట్టిప్రోలు: డ్వాక్రా సంఘాల రుణాలను రీషెడ్యూల్ చేసి వడ్డీ ప్రభుత్వమే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి, బాపట్ల కార్యదర్శి సీహెచ్. గంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సీపీఎం బృందం రెండు రోజులుగా రైతులు, కౌలు రైతులు, డ్వాక్రా మహిళలను కలసి వారి సమస్యలను తెలుసుకుంటోంది. వరదలకు పంటలు పూర్తిగా నాశనం అయ్యాయని పలువురు వాపోయారు. వరదల వల్ల పాడైన ఇళ్లకు రూ. 10 వేలు నష్టపరిహారం చెల్లించాలని, డ్వాక్రా రుణాలు తీసుకున్న వారు తిరిగి కట్టేందుకు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. పర్యటనలో నేతలు ఎం.సత్యనారాయణ, పి.మనోజ్, వి.వెంకట్రామయ్య, బీఎల్‌కే ప్రసాద్, పి.నాగమల్లేశ్వరరావు, బి. సుబ్బారావు, బి.అగస్టీన్ పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు జాన్‌వెస్లీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్రిస్టియన్ మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ఆయా వర్గాలతో పార్టీ బలోపేతానికి పాటుపడతానని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి తాను అందించిన సేవలను గుర్తించిన వైఎస్ జగన్ గత ప్రభుత్వంలో ఏపీ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించారన్నారు. మళ్లీ గుర్తించి పార్టీలోని క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించడం పట్ల వైఎస్ జగన్‌కు ఎప్పుడు రుణపడి ఉంటానని జాన్‌వెస్లీ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చిలకలూరిపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణం పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతవరం గ్రామానికి చెందిన షేక్ ఉప్పలపాటి నాగూర్ (31) హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొద్దిరోజులుగా వర్క్‌ఫ్రం హోం కింద స్వగ్రామంలోని ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం కమ్మవారిపాలెంలోని ఓ శుభకార్యానికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా పట్టణంలోని సుభానినగర్‌లో ఉన్న తన అన్న ఇంటికి వెళ్లేందుకు 3 గంటలకు బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో రాజీవ్‌గృహకల్ప సమీపంలోకి ఓ మలుపు వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు తీవ్రగాయాలతో ఉన్న నాగూర్‌ను పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.